


# నాన్నని పంచుకుందాం

హన్మంతయ్య తను సంపాదించిన ఆస్తులన్నీ వూరి పెద్దల ముందు... నలుగురు కొడుకులకీ పంచాడు.

ఈ ఆస్తి కోసం... వాళ్లు నలుగురూ తగువులాడుకున్న తీరు... తిట్టుకున్న

తీరు అనుబంధాలూ, ఆప్యాయతలూ మర్చిపోయి దాదాపు కొట్టుకున్న తీరు చూసాక... హన్మంతయ్యకు కొడుకుల పట్లే కాదు... తాను సంపాదించిన ఆస్తి పట్ల కూడా అసహ్యం పుట్టింది.

అందుకే పంచేసాడు.

అంతా పంచాక... మిగిలిపోయి పనికిరాని ఆస్తిగా కన్పించాడు ఆ తండ్రి.

అందుకే... అతణ్ణి పంచుకోవటంలో... ఆస్తి పంచుకోవటంలో చూపించినంత ఉత్సాహం, పట్టుదలలు ఏవీ చూపించలేదు.

పంచాయతీ పెద్దల మాట ప్రకారం అంతా ముభావంగా కూచొని... నిశ్శబ్దంగా తీర్పువిన్నారు.

హన్మంతయ్య ఒక్కో కొడుకింట్లో మూణ్ణెళ్ళ చొప్పున వున్నట్లయితే... సంవత్సరం గడిచిపోతుంది. అందుకని ముందు పెద్దవాడి వంతుతో మొదలై... చిన్నవాడి వంతుతో ముగుస్తుంది..' అని తీర్పిచ్చారు.

ఎవరూ సంతోషపడలేదు...

'ఈయనకి బదులు అమ్మ బతికున్నా బావుండేది. తిండికి తగ్గ ఇంటిపని, వంట పనైనా చేసేది.' అన్న భావం మాత్రం అందరి మనస్సుల్లోనూ క్షణం పాటు మెదిలింది.

హన్మంతయ్య బరువు గుండెల్లో మాత్రం భార్య కమలమ్మ కదలాడింది...

'కమలా... చాలా తొందర్లో నీ దగ్గరికి వచ్చేలా చేయి... నాన్నగా నన్ను

పంచుకుంటున్న తీరు చూస్తుంటే... నా అవయవాలు ఒక్కొక్కటి తెగ నరికినట్టుగా అన్పిస్తోంది... కొడుకుల ఇళ్లల్లోకి వెళ్తున్నట్టుగా లేదు... వాళ్ళ ప్రవర్తన ఇప్పుడే పూటకుళ్ల ఇల్లకన్నా దారుణంగా వుంది. ఆకల్నీ... ఆత్మాభిమానాన్ని చంపేసుకుంటే తప్ప బతకలేనేమో...' అనుకున్నాడు భారంగా.

పెద్దవాడింట్లో....

పదకొండయినా కోడలి వంట పూర్తి కాలేదు. పెద్దవాడిది వ్యాపారం కనుక మధ్యాహ్నం ఎప్పుడో వచ్చి తినిపోతాడు. పిల్లలకి ఇడ్లీలు తినిపించి స్కూలుకి పంపాక నెమ్మదిగా వంట మొదలు పెడుతుంది.

హన్మంతయ్యకి ఈ మధ్యే కొంచెం షుగర్ జబ్బు మొదలవటంతో... ఉదయాన్నే ఆకలి నకనకలాడేది. పన్నెండున్నర దాకా అన్నం కోసం ఆగటం ఆయనకి తరమయ్యేది కాదు.

కొడుకు షాప్‌కెళ్తే... కోడల్ని అడగాలంటే ఏదో బెరుకు... భయం. చివరకి ఓరోజు ఆకలి బాధ తట్టుకోలేక 'అమ్మా... తొమ్మిది గంటల వరకల్లా వంట చేయ్యకూడదా' అన్నాడు మాటలు కూడ దీసుకుంటూ...

ఆనాటి వరకూ నిశ్శబ్దంగా వున్న కోడలు తన అక్కసుని భళ్లున కక్కేసింది. "మాకేమైనా ఉద్యోగాలున్నాయా? ఊళ్లేలాల్సి ఉందా? ఏదో చిన్న బిజినెస్‌తో బతుకుతున్నాం. తొమ్మిది గంటలకు వంట చేసి హాట్‌పాట్‌ల్లో సర్దిపెట్టడానికి మీ కొడుకు గెజిటెడ్ ఆఫీసర్ కాదు. బిజినెస్ చేసుకునే వాళ్లకి తిండి విషయంలో వేళాపాళా వుండదు. అర్థం చేసుకోరూ... " అంది విసుగ్గా.

ఇక ఆ రోజునించీ ఆమె ప్రతాపం చూపించేది. పెద్దకొడుకైన తన భర్తకి జ్యేష్టపు పాలు కింద ఎక్కువగా ఏమీ ఇవ్వలేదన్న కోపం ఆమెకి బాగా వుంది.

"షుగర్ వేసిన టీ తాగలేనమ్మా..." అంటే.

"ఈ ఇంట్లో ఒకరికి షుగర్‌లెస్, ఒకరికి షుగర్‌తో, ఇంకొకరికి కాఫీ... ఇలా నా వల్లకాదు. ఈ పూటకి తాగండి. ఏం కాదు." అనేది.

హన్మంతయ్యకి ఆ టీ తాగగానే ముచ్చెమటలు పోసేవి. గుండెల్లో దడ హెచ్చేది.

'కూరల్లో ఉప్పు తగ్గించవమ్మా' అని నోరు విడిచి అడిగితే కొడుకే కసురుకున్నాడు.

"అన్నంలో కాస్త కూరలు తక్కువగా కలుపుకుంటే సరి... దానికి ఉప్పు తగ్గించటం దేనికి? అని.

ఆ మాట హన్మంతయ్య గుండెలో చివ్వున గుచ్చుకుంది.

కొడుక్కి వంత పాడిన కోడలు "అసలీ వయసులో అన్నం కూరలు ఎక్కువగా తినకూడదు. ఎందుకంటే జీర్ణశక్తి ఎక్కువగా ఉండదు కదా" అంది.

ఆ రోజునించీ హన్మంతయ్య సగం కడుపుకే తినటం నేర్చుకున్నాడు. మూడు నెలలు తిరిగే సరికి... జవసత్వాలు ఉడిగిపోయినట్లయి.. డాక్టర్ని కలిసాడు.

"మీకు ఎన్నడూ లేనిది లో బీపీ వచ్చింది... తిండి సరిగ్గా తినకే మీ కడుపులో గ్యాస్ ఫామ్ అవుతోంది. మీరీ వయసులో సరిగా తిండి తినకపోతే

ఇంకా లేనిపోని జబ్బులొస్తాయి. మంచి డైట్ తీసుకోండి" అన్నాడు డాక్టర్... హనుమంతయ్య పరిస్థితి గురించి ఏమాత్రం తెలీక.

ఆరోజుతో మూడునెలలు గడిచాయి. రెండో కొడుకు తీసికెళ్ళడానికి రాలేదు. ఆ రోజు కోడలు మరింత చిర్రుబుర్రులాడింది. చివరికి పెద్దవాడు తమ్ముడికి ఫోన్ చేశాడు. నాన్నని తీసికెళ్లమని. రెండో వాడి ఇంట్లో...

రెండో కొడుకు, కోడలూ ఇద్దరూ ఉద్యోగస్తులే...

అందుకే రాత్రిళ్లు వండుకొని ఫ్రిజ్‌లో పెట్టేది కోడలు. ఉదయాన్నే యుద్ధభూమికి బయల్దేరుతున్నంత హంగామా వుండేది ఇంట్లో... వాళ్ళు గబ గబ పాలు, బ్రెడ్ లాంటివి తినేసి....

"ఆకలేస్తే ఫ్రిజ్‌లో అన్నీ వున్నాయి పెట్టుకొని తినండి" అని స్కూటర్ మీద జుమ్మని వెళ్లిపోయేవారు.

భార్య బతికున్నప్పుడు 'చలి కూడు' అంటూ ఎరగని హనుమంతయ్యకి మంచుముద్దల్లాంటి ఆ అన్నం కూరలేవి నోట్లోకి దిగక గిలగిల్లాడేవాడు.

పోనీ... తనేదైనా చేసుకుందామన్నా వయసు సహకరించేది కాదు...

పళ్లెంలో అన్నం పెట్టుకొని పరధ్యానంగా అలాగే కూచుండి పోయేవాడు.

కొడుకుల ఎదుగుదల కోసం ఆలోచిస్తూ ఏనాడైనా అలాగే పళ్లెం ముందు కూచుంటే 'అన్నం చల్లారి పోతుందయ్యా' అనేది కమల... కానిప్పుడు చల్లారిన అన్నం ముందు ఎంతసేపు కూచున్నా... ఏదీ అడిగేవారు లేరు.

ఇంట్లో ఒంటరితనం పీల్చి పిప్పి చేసేది.

సాయంత్రం కూడా పొడిపొడి మాటలు తప్ప ఏ ఆలికిడీ వుండకపోయేది. హనుమంతయ్యకి విసుగొచ్చి కొడుకుతో "ఏమిట్రా... నన్నెప్పుడూ పట్టించుకోవూ" అన్నాడు. వాడి మనసులో ఏముందో అప్పుడు బయటపడింది.

"నడిపోడంటేనే డమ్మీ కొడుకుల్తో సమానం. మేమేమైనా నీకు, అమ్మకి తలకొరివి పెట్టేవాళ్లమా... అందుకోసం మాకేమైనా జ్యేష్ఠపు పాలు ఇస్తారా... పంపకల్లో కూడా మధ్య పోర్షన్లు ఇచ్చి... కిటికీలు, వెంటిలేషన్లు లేని చీకటి గదులు ఇచ్చారు. అన్నిట్లోనూ నడిపోడే నష్టపోతాడు. ఇంట్లో పెద్దోడికీ, చిన్నోడికీ లాభాలు..." అన్నాడు.

ఆ రోజు హన్మంతయ్య ఆ "చలికూడు" కూడా తిన్లేదు.

ఎందుకో... ఊపిరి తీయటం భారంగా అన్పించి... డాక్టర్ దగ్గరి కెళ్లాడు.

డాక్టర్ పరీక్షలన్నీ చేసాక హన్మంతయ్యతో...

"మీ డైట్‌లో ఏదో మార్పు వచ్చినట్టుంది. ఈ వయసులో ఒకే రకమైన డైట్ కంటిన్యూ చేయాలి. చలికూరలు, చలి అన్నం లాంటివి ఏమీ తినకూడదు. మీ ఊపిరి తిత్తుల్లో బాగా తెమడ వచ్చింది.. మీ కిప్పుడు 'అస్తమా' ఎఫెక్ట్ అయింది..." అన్నాడు.

అస్తమా....

అస్తమా...

హన్మంతయ్య కొత్త రోగానికి భయపడలేదు.

నిర్వికారంగా నవ్వాడు.

"ఇల్లు మారితే తిండి మారుతుంది డాక్టర్. అది బిచ్చగాడికైనా, కన్న తండ్రికైనా తప్పదు" అని మనసులో అనుకొని మందులు కొనుక్కోకుండానే వచ్చేసాడు. మూడ్రోజుల ముందే రెండోవాడు తమ్ముడికి ఫోన్ చేసాడు. ఫలానా రోజు నాన్నని తీసికెళ్లరా... ఇప్పుడు నీవంతే" అని.

మూడో కొడుకింట్లో...

మూడోవాడు ఇప్పుడిప్పుడే రాజకీయాల్లో ఎదుగుతున్నాడు. కౌన్సిలర్ నించి వైస్ చైర్మెన్‌గా ఎదిగాడు. వాడి ఇల్లంతా పైరవీకార్లతో సందడిగా వుంటుంది.

కోడలు వంట చేసేకన్నా... ఎక్కువ వాడే హోటల్‌నించి తెప్పిస్తాడు.

దాదాపుగా రోజూ బిర్యానీల వాసన ఇల్లంతా పరుచుకొని... సాయంత్రానికల్లా అది వెగటుగా మారుతుంది. ఆ నూనె పదార్థాలు జీర్ణం కాక హనుమంతయ్యకి ఆయాసం వచ్చేది.

ఏ రిజర్వేషన్లు ఎప్పుడొస్తాయో అని... వాడు పెళ్లాన్ని కూడా రాజకీయాల్లోకి దింపాలన్న ఆలోచనతో వుండి... వచ్చిన ప్రతివాళ్లకి భార్యని పరిచయం చేసి రాజకీయాలు డిస్కస్ చేసేవాడు. క్రమంగా కోడలికి పెద్దరికం మాటలు ఒంటబట్టాయి. ఎవరైనా రాగానే సోఫాలో కాలుమీద కాలేసుకొని కూచొని కబుర్లలో పడిపోయేది. ఆ ధ్యాసలో కాఫీ కూడా ఇవ్వటం మర్చిపోయేది. మాటల్లో పడి...

సమయానికి అన్నం పెట్టటం మర్చిపోయేది.

హన్మంతయ్య తన గదిలో వెక్కి వెక్కి ఏడ్చేవాడు.

కడుపులో పేగులు మెలికలు తిరుగుతున్నట్టయ్యేది.

"నలుగ్గురు కూచుండి భోజనం చేసే డైనింగ్ టేబిల్ దగ్గరికి మీరెందుకు లెండి ఇదే గదిలోకి అన్న పంపిస్తాను పనిమనిషిచేత అని పరోక్షంగా గదిలో బంధించినట్టుగా వుంచేది.

పని మనిషి ఏ ఒంటిగంటకో ఫళ్లెంలో అన్నం, నీళ్లు తెచ్చిపెట్టేవాడు. వాడి రాకకోసం చూసి చూసి కళ్ళు కాయలు కాసేవి.

ఆకలి పేగులు అరచి అరచి మూగవోయేవి.

కొడుకు ఏ రాత్రో వచ్చేవాడు.

ఏ నాలుగైదు రోజులకోమారు గాని పలకరించేవాడు కాదు. నాలుగేళ్ల చిన్న పిల్లాడి ఆలనా పాలనా పని మనిషే చూసుకునేది.

హన్మంతయ్యకి ఆకలేసి... కడుపు నొప్పి మొదలయ్యేది... అన్నం తిన్న తర్వాత కడుపులో మంట లేచేది...

పేగులు తగలపబడిపోతున్నట్టు... భరించరాని మంట... డాక్టర్ దగ్గరి కెళ్లాలన్నా మనసొప్పటం లేదు... అప్పటికే రెండు నెలలు గడిచి పొయ్యాయి.

ఇంట్లో మరో మనిషి వున్నాడన్న కనీస ధ్యాస కొడుక్కి, కోడలికి లేకపోవటం బాధించేది. ఇద్దరూ రాజకీయాల్లో బిజీ... బిజీ...

మనవడితో ఆడుకుందామన్న వాణ్ణి ఈ మధ్యే స్కూల్లో వేసారు.

ఓరోజు కోడలు కొడుకుతో అంటోంది.

"వీడు మనకొక్కడే చాలండీ... ఎందుకంటే మనం రాజకీయాల్లో ఎదగాలనుకుంటున్నవాళ్లం అందుకే నేను గాని, మీరు గాని ఆపరేషన్ చేయించుకోవాలి" అంది.

హన్మంతయ్యకి ఆమాట అర్థం కాలేదు. కొడుక్కి అర్థమైనట్టుంది.

"అవునూ... నీ ఆలోచన నిజమే... ఎప్పుడు ఏ చట్టాలు ఎలా మారుతాయో తెలీట్లేదు" అన్నాడు.

హన్మంతయ్య మరింత అయోమయానికి గురై "అదేంట్రా... ఒక్క ఎద్దు నాగలి కాదు... ఒక్క కొడుకు కొడుక్కాదు అంటారు. ఇంకొకరైనా పుట్టేదాకా ఆగండి" అన్నాడు .

కోడలు వెంటనే "మీకు తెలీదు మావయ్యా... ఇప్పుడు ముగ్గురు పిల్లలుంటే ఏ పదవికీ పోటీ చెయ్యడానికి ప్రభుత్వం ఒప్పుకోవట్లేదు. ముందు ముందు ఆ చట్టం కాస్తా ఇద్దరు పిల్లలుంటేనే పోటీ చేయరాదని మార్చారనుకోండి. మాకు ఇబ్బందే కదా... అందుకని ఒక్కడితో చాలనుకుంటున్నాం... సరేగాని మీకు గదిలో అన్నం పంపిస్తాను. వెళ్లండి..." అంది.

హనుమంతయ్య కడుపులో మంట హోమగుండమే అయింది. కొడుకుల ఇళ్లల్లోని తిండి వల్లే కాదు, వికారమైన వీళ్ల మనస్తత్వాలకి కూడా మనసు వికలమై తనకిన్ని రోగాలొస్తున్నాయేమో అనుకున్నాడు.

ఆ రోజు అన్నం తినాలన్పించలేదు. కొడుకు కోడలు చూడకుండా బయట కుక్కకి పడేసాడు. విధిలేక కడుపులో మంట ఎక్కువవుతుంటే డాక్టర్ దగ్గరికెళ్లాడు.

ఆయన అన్ని టెస్టులు చేసి... మీకు అల్సర్ స్టార్టయింది. మీరెందుకిలా రోగాల కుప్పలా మారుతున్నారో నాకర్థం కావటం లేదు" అన్నాడు మందులు రాస్తూ...

హనుమంతయ్య మరో కొత్తరోగం బయటపడ్డందుకు ఏమీ దిగులు పల్లేదు. కాని... రేపట్నించి చిన్న కొడుకింటికి వెళ్లటమే బెంగగా వుంది.

ఎందుకంటే...

చిన్నప్పట్నించీ వాడు పెద్ద పిసినిగొట్టు....

అదొక వ్యాధిలా ముదిరి... పెళ్లి పీటల మీద ఎక్కడో రెండొందలు తగ్గినందుకు తాళి కట్టటం అరగంట ఆలస్యం చేసాడు. పెళ్లి పీటల మీంచే వస్తున్న కట్న కానుకలెన్నో గమనిస్తూ... ఒక ప్రజెంటేషన్ తగ్గిందని కంగారు పడ్డాడు.

వాడి గుణం మార్చటం తల్లికే సాధ్యం కాలేదు.

ఆలాంటిది వాడింట్లో తన పరిస్థితేంటో వూహిస్తేనే హనుమంతయ్య మనసు నీరై పోతోంది.

ఆలోచిస్తూ ఇంటికొచ్చేసరికి మూడోవాడు తన సూటుకేసు బయటికి తీస్తూ "కోడలు నీ లగేజి సర్దింది నాన్నా.... నిన్ను తమ్ముడి దగ్గర దింపేస్తాను రా..." అన్నాడు.

హన్మంతయ్య నిశ్శబ్దంగా బండెక్కాడు.

చిన్నవాడింట్లో....

చిన్నకొడుకింట్లోకి వెళ్లేసరికే... భార్యాభర్తల మధ్య ఏదో గొడవ జరుగుతోంది.

"ఏమిటమ్మా..." అనడిగాడు కోడల్ని హనుమంతయ్య.

"ఈయనతో సంసారం చేయటం నావల్ల కాదు. రోజూ వంట చేయడానికి ఆయనే బియ్యం కొలిచి ఇవ్వటం ... ఆఫీస్ నించి రాగానే పప్పుడబ్బాలు, దినుసు డబ్బాలు చూసి... బఠానీలు తక్కువయ్యాయి. జీడీ పప్పు అరవైరెండు బద్దలకి రెండు తగ్గాయేంటి అనడుగుతారు. సిలిండర్ ఖచ్చితంగా నూటాఇరవై రెండ్రోజుల పైనే రావాలట... లావెట్రీ కడగటానికి వేరే చీపురు ఎందుక్కొన్నావ్ అంటారు... మీరే చెప్పండి మావయ్యా... నేను వెళ్లిపోతాను." అంది ఏడుస్తూ.

ఆ మాటతో చిన్న కొడుకు భార్య మీదికి గయ్‌న లేచాడు.

"నాది ప్రయివేట్ జాబ్ తెల్సా. గవర్నమెంట్ ఉద్యోగం, లంచాలు తీస్కోవటం నా ముఖాన రాసిలేదు. అన్నింటినీ పొదుపుగా వాడుకోకపోతే ఎలా? అని వాదించాడు.

"ఇప్పుడే పిల్లలు పుడితే ఖర్చు ఎక్కువంటున్నాడు. పెళ్లయి మూడేళ్లయినా... బయటికి అమ్మలక్కలు నన్నెంత హీనంగా చూస్తున్నారో మీకేం తెల్సు... చచ్చేటప్పుడు మీ వెంట తీసికెళ్తారా" సీరియస్‌గా అంది కోడలు.

వాళ్లిద్దరి గొడవ ముదరటంతో హనుమంతయ్యకి అసహ్యం వేసింది. చివరికి కోడలు అలిగి బెడ్‌రూంలోకెళ్లి పడుకుంది.

"ఒక్కపూట డైటింగ్ చేస్తే వచ్చే నష్టమేం లేదు" కోపంగా అంటూ

వాడూమరో గదిలోకెళ్లాడు.

ఒంటరిగా మిగిలిన హనుమంతయ్యకి కడుపులో దేవినట్లయింది.

ఆకలేసినట్లయితే... దరిద్రానికి ఆకలెక్కువ అని తనని తాను చీదరించుకొని వంటగదిలో కెళ్లి చెంబెడు నీళ్లు తాగాడు.

ఆ క్షణాన... చచ్చిపోతే బావుండుననిపించింది.

భార్య గుర్తొచ్చి 'కమలా... నువ్వు అదృష్టవంతురాలివే' అనుకున్నాడు.

అప్పుడే...

చిన్నకొడుకు చిర్రుబుర్రు లాడుతూ.. కేలండర్ పట్టుకొని వచ్చాడు. 'నాన్నా' అని పిలుస్తూ...

కొడుకు మొహంలో విపరీతమైన ఆరాటం చూసి 'ఏమిట్రా' అన్నాడు హన్మంతయ్య కంగారుగా..

"ఇదెక్కడి న్యాయం నాన్నా... పెద్దన్నయ్య మూడు నెలలు అంటూ లెక్కగట్టి తొంభై రోజులే నిన్నుంచుకున్నాడు... అలాగే రెండో అన్నయ్య కూడా మూడు నెలలు అంటూ తొంభై రోజులూ, మూడోవాడు కూడా తొంభై రోజులే నిన్నుంచుకున్నాడు. ఈ లెక్కన 270 రోజులే వాళ్ళు నిన్నుంచుకున్నారు. కాని సంవత్సరానికి 365 రోజులు కదా... మరి 365 రోజుల్లోంచి 270 పోతే 95 రోజులు మిగుల్తున్నాయి. అంటే నా మీద నిన్ను అయిదు రోజులు ఎక్కువేసారు. ఇదెక్కడి న్యాయం నాన్నా అన్నాడు క్యాలెండర్ పేజీలు మరోసారి తిరగేస్తూ...

హన్మంతయ్య హతాశుడయ్యాడు...

కాళ్లకింది భూమి కంపించిపోయింది...

కళ్ల గోళాల మీద కన్నీళ్లు మంటల్లా కప్పేసాయి...

పిడికెడు గుండె ఫెటేల్‌మని చిట్లిపోయేదల్లా... ఎందుకో ఆగిపోయింది. సన్నటి నొప్పి గుండె గదుల్లో మెరుపులా పాకిపోయింది...

హన్మంతయ్య కొడుకు భుజం తట్టాడు...

"ఒరేయ్ కన్నా... నేను మీ అమ్మా మీకు గోరుముద్దలు తినిపించేటప్పుడు ఎప్పుడూ ఇలా లెక్కలు వేయలేదు... అయిదు రోజులు నీకు ఎక్కువ భారం కదూ.. నిజానికి నేను చివరగా నీ ఇంటికి రావటంతో నీకే లాభం జరుగుతుందిరా..." అన్నాడు భారంగా...

"అదెలా...?" అంటూ చిన్నకొడుకు సందిగ్ధంగా మళ్లీ లెక్కలు పెడుతూ తన గదిలోకెళ్లిపోయాడు.

అరగంట తర్వాతా...

హన్మంతయ్య 'గుండెపోటు'తో చచ్చిపోయాడన్న విషయం తెల్సి ఒక్క డాక్టర్ మాత్రం నిర్ఘాంతపోయాడు.

❋ ❋ ❋